# చింతపల్లిఆర్ ఐ టి ఐ యూనిట్ లో ఏకగ్రీవ ఎన్నికలు



**చింతపల్లి పెన్ పవర్ అక్టోబర్ 4:-** చింతపల్లి ఆర్ఐటిఐ, డి ఎల్ టి సి అసోసియేషన్ విజయవాడ వారు ఇచ్చిన నోటిఫికేషన్ మరియు ఆదేశాలు ప్రకారం ఈ రోజు చింతపల్లి గవర్నమెంట్ ఆర్.ఐ టి ఐ లో యూనిట్ ఎలక్షన్ లు నిర్వహించటం జరిగినది. సిబ్బంది నుండి నామినేషన్ లు స్వీకరించి,వేసిన నామినేషన్లు పోటీలేకుండా ఉండుట వలన నామినేషన్ వేసినఅభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకొని ఫలితాలు బొత్స ఈశ్వర రావు ఎలక్షన్ ఆఫీసర్ ప్రకటించడం జరిగింది.టీ శ్రీనివాస్ - ప్రెసిడెంట్ఏం. రాం ప్రసాద్ వైస్ ప్రెసిడెంట్ ఆర్ భుజంగరావు సెక్రటరీకె ధనుంజయ్ రావు జాయింట్ సెక్రటరీబి సింహాచలం ట్రెజరర్ ఎన్నుకోవడం జరిగింది

10 YEAR ANNIVERSARY 2014 - 2024
# పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

## వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ
# జిల్లాలో రూ.63,266.10 కోట్లతో వార్షిక రుణ ప్రణాళిక





- వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ రూ.7,108 కోట్ల కేటాయింపు
- బ్యాంకర్లు, అధికారులతో కలిసి విడుదల చేసిన కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్టణం, అక్టోబర్ 04** :కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, పారిశ్రా మిక రంగ ఔత్సాహికులు, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రూ.63,2 66.10 కోట్లతో రూపొందించిన జిల్లా వార్షిక రుణ ప్రణాళికను శుక్రవారం స్థానిక కలెక్టరేట్లో జరిగిన జిల్లా సమీ క్షా సమావేశంలో వివిధ రంగాల అధికారులు, బ్యాంకుల ప్రతినిధులతో కలిసి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ విడుదల చేశారు. అందులో ప్రాధాన్యత రంగాల కు రూ.23,090 కోట్లు కేటాయించగా, ఇతర రంగాలకు రూ.40,176.59 కోట్లు కేటాయించారు. వ్యవసాయ రంగానికి రూ.రూ.7,108 కోట్లతో పెద్దపీట వేశారు. విద్యాపరమైన అవసరాలకు రూ.294 కోట్లు, గృహ నిర్మాణ అవసరాలకు రూ.1,355 కోట్లు కేటాయించారు. జిల్లాలో వ్యవసాయ, దాని అనుబంధ రంగాలు, ఎం.ఎస్.ఎం.ఈ., విద్యా రుణాలు, గృహ రుణాలు, స్వయం సహాయ సంఘాలు మొద లైన వాటికి అధిక ప్రాధాన్యత కల్పించారు.ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన జిల్లా సమీక్షా సమావేశంలో బ్యాంకుల ప్రతినిధులు, అధికారులతో కలిసి రుణ ప్రణాళికను విడుదల చేసిన కలెక్టర్ మాట్లాడు తూ అన్ని రంగాలకు ఫైనాన్సింగ్తో పాటు, జిల్లా స్థూల విలువ జోడింపు (జివి.ఏ)లో రెండంకెల వృద్ధిని సాధించడంలో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు ఈ ప్రణాళిక దోహదపడుతుం దని పేర్కొన్నారు.లక్ష్యాలకు అనుగుణంగా అందరూ పని చేయాలి,నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు, బ్యాంకుల ప్రతినిధులు పని చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. సమీక్షా సమావేశంలో భాగంగా వివిధ అంశాలపై సుదీర్ఘంగా చర్చించిన ఆయన పలు మార్గదర్శకాలు జారీ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ప్రోత్సహించేలా, రైతులకు అండగా నిలిచేలా రుణ మంజూరు ప్రక్రియ ఉండాలని సూచిం చారు. ప్రభుత్వ సంస్థల నుంచి సాధారణ పౌరుల నుంచి రుణాల నిమిత్తం వచ్చే దరఖాస్తులను పరిశీలించి నిర్ణీత కాలంలో సాయం అందించాలని చెప్పారు. ఎం.ఎస్. ఎం.ఈ., విద్య, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ రుణాలు విడుదల చేయాలని సూచించారు. ఈ క్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలు వాటికి బ్యాంకుల నుంచి అందుతున్న రుణ సాయం గురించి ఆరా తీసిన కలెక్టర్ అందరికీ ప్రయోజనాలు కలిగేలా బ్యాంకులు సహకారం అందించాలని, రుణ ప్రక్రియలో సరళతర విధానాలు అమలు చేయాలని హితవు పలికారు.ఈ సమావేశంలో ఎల్.డి.ఎం. ఎం. శ్రీనివాసు, రిజర్వ్ బ్యాంకు ప్రతినిధి పి. పూర్ణిమ, నాబార్డు డీడీఎం జి.ఆర్. సమంత్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి అప్పలస్వామి, డీఆర్డీఏ పీడీ లక్ష్మీకాంత్ ఇతర జిల్లా స్థాయి అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు. .

# జిల్లా విజన్ ప్లాన్

## హోం మంత్రి వంగలపూడి అనిత కామెంట్స్
## జగన్ చేసిన మోసాలు బయటికి వస్తున్నాయి.




**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం అక్టోబర్ 04** :స్వర్ణాంధ్ర-2047 తో ప్రపంచ దేశాలలో భరతదేశం అగ్రగామిగా అభివృద్ధి చెందాలి. 2024- 2029 వరకు గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నాం.

వృద్ధిరేటు పెరిగేలా ప్రణాళికతో ముందుకు వెలుతున్నాం.గత ఐదు సంవత్సరాలగా అన్ని రంగాలను నిర్వీర్యం చేసారు.అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడ్డారు.అనకాపల్లి జిల్లా అన్ని విధాలగా అభివృద్ధి చెందడానికి అవకాశాలు ఉన్నాయి.73 కిలోమీటర్ల తీరప్రాంతం ఉంది.

పర్యాటక,వ్యవసాయం,పారిశ్రామిక రంగాలతో జిల్లా మరింత అభివృద్ధి చెందబోతుంది. పాఠశాలల్లో మౌలిక వసతలు కల్పిస్తున్నాం. చంద్ర బాబు విజన్-2020 అంటే అందరు నవ్వుకు న్నారు.హైదరాబాద్ ను అభివృద్ది చేసి చూపిం చారు.స్వర్ణాంధ్ర-2047లో ప్రజలు భాగస్వా మ్యం కావాలి.ప్రతి ఒక్కరు సూచినలు,సలహా లు ఇవ్వాలి.జగన్ మోహన్ రెడ్డి 151 సీట్లు నుండి 11 సీట్లుకు పడిపోయారు.ఈ వందరో జుల పాలనపై మేము చర్చకు సిద్ధంసకాలంలో ఫించన్ లు ఇస్తున్నాం.ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ ను రద్దు చేసాం.అన్నా క్యాంటీన్లు ప్రారంభిం చాం,నూతన ఇసుక విధానం తీసుకువచ్చాం.

త్వరలో ఉచిత బస్సు,ఫ్రీ గ్యాస్ అందుబాటు లోకి తీసుకువస్తాం.చంద్రబాబుకు సంపద సృష్టించడం తెలుసు అని పలికారు.

# ప్రజల విశ్వాసాన్ని పొందండి



డాక్టర్లకు కలక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ హితవు

**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,పెన్ పవర్,అక్టోబర్ 04:** ప్రభుత్వ ఆసుపత్రులలో డాక్టర్లు ప్రజల విశ్వాసాన్ని పొందాలని, జాతీయ నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ హితవు పలికారు. శుక్రవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో జిల్లాలోని 18 ఆసుపత్రులకు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్(ఎన్ క్యూఎఎస్) సర్టిఫికేట్లను కలెక్టర్ సంబంధిత డాక్టర్లకు అందజేశారు.జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలు, ప్రభుత్వ ఆసుపత్రుల విశ్వసనీయతను పెంచడం, మంచి పనితీరు సౌకర్యాలను గుర్తించడం కోసం ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ ఈ ధృవపత్రాలను జారీ చేసిందని కలెక్టర్ పేర్కొన్నారు.ఎన్ క్యూఎఎస్ ప్రమాణాలు, ప్రజారోగ్య సదుపాయాలకు, గ్లోబల్ బెస్ట్ ప్రాక్టీస్లకు అనుగుణంగా రోగులకు, ఆరోగ్య సంరక్షణ ప్రదాతలకు నాణ్యమైన సేవలు అందించడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. జిల్లా పరిధిలో మూడు (అరుకు, చింతపల్లి, కూనవరం) ప్రాంతీయ ఆసుపత్రులకు,ఏడు (ఇందుకూరుపేట, తాజంగి, సప్పర్ల, పీడతమామిడి, జి.మాడుగుల, ఎల్లవరం, లాగరాయి) ప్రాథమిక ఆసుపత్రులకు ఆరు (మూసిరిమల్లి, గుట్టులపుట్టు, అడుగులపుట్టు, కొత్త పాడేరు, నెల్లూపూడి, చింతూరు, రెండు హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్స్ యొక్క అత్యుత్తమ సేవలను గుర్తించి సంబంధిత వైద్యాధికారులకు మరియు కమ్యూనిటీ హెల్త్ సిబ్బందికి జిల్లా కలెక్టర్ ప్రశంసా పాత్రలను అందించి అభినందించారు.

ఈ కార్యాక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ డా.అభిషేక్ గౌడ్, ఐ.టి.డి.ఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్,సబ్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్, డిఆర్ఓ,బి.పద్మావతి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. జమాల్ భాషా,ఎన్ క్వాస్ వైద్యాధికారులు గుర్తింపు పొందిన ఆసుపత్రుల వైద్యాధికారులు తదితరులు పాల్గున్నారు.



## ఉద్యమ వీరుల విగ్రహాల ఏర్పాటుకు స్థలం కేటాయించండి:

జిల్లా జాయింట్ కలెక్టర్ ని కోరిన చింతపల్లి జెడ్పీటీసి పోతురాజు బాలయ్య



**చింతపల్లి పెన్ పవర్ అక్టోబర్ 4:**అల్లూరి సీతారామరాజు మరియు ఆదివాసీ ఉద్యమ వీరుల విగ్రహాల ఏర్పాటుకు చింతపల్లిలో స్థలం కేటాయించండని చింతపల్లి జెడ్పీటీసి పోతురాజు బాలయ్య శుక్రవారం గ్రీవెన్స్ లో జిల్లా జాయింట్ కలెక్టర్ ని కోరారు.శుక్రవారం పాడేరులో గ్రీవెన్స్ లో వివిధ సంఘాలు,రాజకీయ పార్టీల నేతలతో జాయింట్ కలెక్టర్ ని కలిసి 1922-24 మధ్యకాలంలో అప్పటి బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అల్లూరి సీతారామరాజు పితూరు మన్యంలో జరిగింది.ఆ పోరాటంలో పాల్గొన్న అల్లూరి సీతరామరాజు విగ్రహాన్ని చింతపల్లిలో మెట్టబంగ్లా దగ్గర గతంలో ఏర్పాటు చేయడం జరిగింది. అల్లూరి సీతారామరాజు విగ్రహం మీదుగా నేషనల్ హైవే వస్తుందని,ఆ విగ్రహాన్ని నేషనల్ హైవే అధికారులు వేరే చోటకు తరలించాలని కోరుతూ కొంత నష్టపరిహారం ఇవ్వడం జరిగింది.ఆ డబ్బుతో పాటు మరికొంత డబ్బుని దాతల దగ్గర విరాళాలు సేకరించి ఆ పితూరిలో పాల్గొన్న అల్లూరి సీతారామరాజు తో పాటు మిగతా ఆదివాసి స్వతంత్ర సమరయోధుల విగ్రహాలు పెట్టుటకు చింతపల్లి మెయిన్ రోడ్డుకు సమీపంలో ఉన్న 30 సెంట్ల ప్రభుత్వ స్థలమును కేటాయించగలరని వినతి పత్రం ఇచ్చి జాయింట్ కలెక్టర్ కోరాగా,తప్పకుండా స్థలం కేటాయిస్తామని జాయింట్ కలెక్టర్ హామీ ఇచ్చారని అన్నారు.ఈ కార్యక్రమంలో భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు,అల్లూరి సీతరామరాజు గిరిజన సంక్షేమ సేవ సంఘం అధ్యక్షురాలు శ్యామల వరలక్ష్మీ,ఎఎస్ఆర్ గిరిజన సేవ సంఘం సభ్యులు మాకాడ బూరుగులయ్య పాల్గొన్నారు.



# గిరిజన ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పించాలి...

## జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

**పార్వతీపురం పెన్ పవర్ అక్టోబర్ 04 :** వన్ దన్ వికాస్ కేంద్రాల ద్వారా గిరిజనులు ఉత్పత్తి చేసిన వస్తువులకు బ్రాండింగ్ కల్పించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆ దిశగా గిరిజన ఉత్పత్తులకు మంచి ప్యాకింగ్ చేసి వాటికి మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని సూచించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లాలోని వన్ దన్ వికాస్ కేంద్రాల పనితీరుపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వన్ దన్ వికాస్ కేంద్రాలన్నీ (వి.డి.వి.కె) బాగా పనిచేయాలని, అందుకు తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి మండలంలో ఒక మోడల్ వన్ దన్ వికాస్ కేంద్రం ఉండేలా విడివికెలను తీర్చిదిద్దాలని కలెక్టర్ తెలిపారు. ఇందుకు అవసరమైన మెషినరీ, శిక్షణ తదితర అవసరాలను తమ దృష్టికి తీసుకువస్తే, వాటిని మంజూరుచేస్తామని వివరించారు. గిరిజనులు పండించిన పంటలకు అదనపు ఆదాయం సమకూరాలని, విడివికె ఉత్పత్తులకు మంచి ప్యాకింగ్ చేసి, వాటికి మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వై.సత్యం నాయుడు, పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎల ఏపీఓలు మురళి, చినబాబు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్తసుజనకోటలో గృహాల మంజూరుకు వినతి పత్రం

- 15 సంవత్సరాలుగా గ్రామంలో గృహాలు మంజూరు చేయని ప్రభుత్వాలు.
- 30 కుటుంబాలకు సరియైన గృహాలు లేవు .
- సర్వే చేసి గృహాలు మంజూరు చేస్తామని ఐటిటిఏ పిఓ హామీ
- సిపిఎం నేత సాలగాం గాసిరందొర.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబర్ 04.**గిరిజనులకు ప్రభుత్వ నూతన గృహాలు మంజూరు చేయడంలో ప్రభుత్వాలు విఫలమైందని, గత 15సంవత్సరాలుగా తమ గ్రామాన్ని ఇండ్ల నిర్మాణ పథకంలో పేర్లు నమోదు చేయకపోవడం, ఇల్లు మంజూరు చేయకపోవడం దారుణమని, తమ గ్రామానికి గృహాలు మంజూరు చేయాలని ఐటిడిఏ ప్రజా సమస్య వేదికలో సిపిఎం నేత గాసిరం దొర ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ.. ముంచంగిపుట్టు మండలంలో గల సుజనకోట పంచాయతీ, కొత్త సుజానకోట గ్రామంలో గత 15 సంవత్సరాలుగా ఏ ప్రభుత్వం కూడ గృహాలు మంజూరు చేయలేదని, అన్ని అర్హతలు ఉండి కూడ గృహ నిర్మాణ పథకంలో లబ్ధి పొందలేదని శుక్రవారం పాడేరు ప్రజా సమస్యవేదికలో పిర్యాదు చేసినట్లు తెలిపారు. గ్రామంలో 30 కుటుంబాలకు సరైనా గృహాలు లేవని, భార్య, పిల్లలతో సొంత ఇల్లులేక చాల ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. అనేకమార్లు గృహాల మంజూరు కొరకు దరఖాస్తు చేసుకున్న ఇల్లు మంజూరు కావటం లేదన్నారు. వినతిపత్రం స్వీకరించిన ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అభిషేక్ తమ గ్రామములో అధికారులను పంపించి ఎంతమందికి గృహాలు లేదో సర్వే చేసి జియో ట్యాగ్ చేసి గృహాలు మంజూరుకు చర్యలు చేపడతామని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గిర్లియ గణపతి, కె సుందర్, ఆర్ ప్రహ్లాదు, గోవింద్ రానా, మధు తదితరులు పాల్గొన్నారు.



# చింతా మోహన్ వ్యంగ్య విమర్శలు

- సూపర్ సిక్స్ ఎప్పుడూ అమలు చేస్తావ్ చంద్రబాబు
- అమరావతి, పోలవరం విషయంలో బాబు కొంగ జపం
- తిరుపతి లడ్డు కల్తీ నిజం, జంతు కొవ్వు అబద్ధం
- నాణ్యత లేకపోతే లడ్డు ధర ఎందుకు పెంచాలి
- విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపి వేయడానికి ప్రయత్నించాలి
- కాశ్మీర్ ఎన్నికల్లో బిజెపి పార్టీ కూడా ఓడి పోతుంది




**విశాఖ దక్షిణం, పెన్ పవర్, అక్టోబర్ 04 :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములో కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చాక సూపర్ సిక్స్ పథకాలు ఎందుకు అమలు చేయలేదని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చింతామోహన్ ప్రశ్నించారు. ఆయన విశాఖప ట్నం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్ క్లబ్ లో శుక్రవా రం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆగస్టు 15 నుంచి రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు హామీ అమలు చేస్తామని ప్రకటన చేశారని గుర్తు చేశారు. కానీ మూడు నెలలు కావస్తున్నా ఉచిత బస్సు ఇంకా రాలేదని మండి పడ్డారు. సూపర్ సిక్స్ పథకాలలో ఒక్క సిక్స్ కూడా కొట్టలేదన్నారు. దమ్ముంటే తెలంగాణ, కర్నాటక మాదిరిగా పథకాలు అమలు చేయాలని కోరారు. అమరావతి, పోలవరం విషయంలో కొంగ జపం చేస్తున్నారని, నిజాయితీగా రాష్ట్ర రాజధాని త్వరగా నిర్మించాలన్నారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి 30 వేల కోట్లు దేనికి ఖర్చు చేశారని ప్రశ్నించారు. ఏ ప్రభుత్వం ఎంత ఖర్చు చేసింది చెప్పాలని డిమాండ్ చేశారు. పోలవరం రాజకీయ పార్టీలు, కాంట్రాక్టర్లకు మాత్రమే వరంగా మారిందన్నారు. తెలంగాణ కాళేశ్వరం ప్రాజెక్టు మాదిరిగా పోలవరం మీద కూడా విచారణ చేయించాలన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కయినా స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. కేంద్రం కుట్ర పన్ని ప్లాంట్ ప్రైవేటీకరణ చేస్తున్నారని ఆరోపించారు. సిఎం చంద్రబాబునాయుడు వల్లనే ప్రైవేటీకరణ ఆగుతుందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం హర్యానా ఎన్నికల తర్వాత ఎప్పుడైనా కూలిపోతుందన్నారు. కాశ్మీర్ ఎన్నికల్లో బిజెపి పార్టీ కూడా ఓడిపోతుందని అన్నారు. చంద్రబాబు నాయుడు అంత అదృష్టవంతుడు వేరొకరు లేరని అభివర్ణించారు. కేంద్రంలో ఆయనకు అన్ని అవకాశాలు కలిసి వచ్చాయని,
ఈ మంచి అవకాశాన్ని జారవిడచకుండా అవకాశం తీసుకుని నిజాయితీగా రాష్ట్రానికి రంగాల్లో అభివృద్ధి చేయాలన్నారు.దేశంలో నిరుద్యోగం, ఆకలి, పన్నులు పెరుగుతున్నాయ న్నారు. వాటి నిర్మూలన పక్కన పెట్టి రాజకీయం గా తిరుపతి లడ్డూ వివాదం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కల్తీ నిజం, జంతు కొవ్వు అబద్ధమన్నారు. తాను కూడా నెయ్యి పరిశీలించానన్నారు. నెయ్యి గడ్డ కట్టకుండా నూనె మాదిరిగా వుందన్నారు. అక్కడి సిబ్బంది అందరూ బ్రాహ్మణులు ఉన్నారన్నారు. లడ్డూ ధర 20 నుంచి 50 రూపాయలకు పెరిగింద న్నారు. లడ్డూ నాణ్యత తగ్గిందన్నారు. సిఎం చంద్ర బాబు నాయుడు స్థాయి మరిచి మాట్లాడారన్నారు. కోట్లాది భక్తులు విశ్వసిస్తున్న వెంకటేశ్వర స్వామి కొలువైన తిరుపతిని బీజేపీ, జనసేన పార్టీలు తిరుపతి కి నష్టం చేస్తున్నా యన్నారు.తిరుమల పవిత్ర కాపాడాలన్నారు. నెయ్యి ధర 700 రూపాయలు వుంటే 315 కి నాణ్యమైన నెయ్యి ఎట్లా వస్తుందని ఆయన ప్రశ్నించారు. పవన్ కల్యాణ్ ప్రసంగము బాధ కలిగించిందన్నారు. కాంగ్రెస్ పట్ల ప్రజల్లో ఆదరణ పెరుగుతున్నా తమకు రాష్ట్రంలో సరైన చర్మిష ఉన్న నాయకులు లేరని ఆందోళన వ్యక్తం చేశారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గార సూర్యారావు పాల్గొన్నారు.

# రైతులకు ఫార్మర్ చాట్ యాప్ పై అవగాహన కార్యక్రమం:-డిజిటల్ గ్రీన్ ప్రతినిధి శ్రీకాంత్



**చింతపల్లి పెన్ పవర్, అక్టోబర్ 4 :-** మారుమూల గ్రామాలతో పాటు వేగవంతంగా పరిష్కారం చేయాల్సిన సాగు సమస్యలను పరిష్కరించేందుకు ఫార్మర్ చాట్ ను వినియోగించుకునే అవకాశం ఉంటుందని డిజిటల్ గ్రీన్ ప్రతినిధి శ్రీకాంత్ పేర్కొన్నారు. చింతపల్లి మండలం, చౌటపాడు గ్రామంలో శుక్రవారం గిరిజన రైతులకు ఫార్మర్ చాట్ యాప్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ ఏజెన్సీతో పాటు మైదాన ప్రాంతాల వారికి వ్యవసాయ సమస్యలను పరిష్కరించేందుకు ఈ యాప్ ను రూపొందించినట్టు చెప్పారు. దీనిపై అవగాహన కల్పించేందుకు మూడు రోజులుగా అల్లూరి జిల్లా, పాడేరు, చింతపల్లి, అరకు వేలీ మండలాల్లో గిరిజన రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. రైతులు సాగు చేసే అన్ని రకాల పంటల్లోని సందేహాలను ఈ యాప్ నివృత్తి చేస్తుందన్నారు. ప్రధానంగా అధికారులు అందుబాటులో లేని మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఆహారం, ఉద్యాన పంటలతో పాటు అన్ని రకాల పంటల్లో ఉండే సమస్యలను పరిష్కరిస్తుందన్నారు. ముఖ్యంగా ఈ యాప్ నుంచి ప్రధానంగా వాతావరణ సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చన్నారు. అదేవిధంగా పంటలను ఆశించే తెగుళ్లు, వాటిని నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పరిష్కారం లభిస్తుందన్నారు. దీంతో పాటు రైతులు సాగు చేసే పంటలకు సంబంధించి మార్కెట్ లో ధరల సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చన్నారు. అదేవిధంగా వ్యవసాయానికి సంబంధించి ఇతర సమాచారం, సలహాలు, పరిష్కారాలను తెలుసుకునేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుందని వివరించారు. రైతులకు సంబంధించిన సమస్యలు నేరుగా వాయిస్ మెసేజ్, ఫొటో, ప్రశ్నలను నేరుగా రాసి ఫార్మర్ యాప్ లో అప్ లోడ్ చేస్తే, దానికి సంబంధించి పరిష్కారం వస్తుందని చెప్పారు. ఈ అవకాశాన్ని సాగు చేసే రైతులంతా వినియోగించుకోవాలని శ్రీకాంత్ కోరారు. కార్యక్రమంలో పలువురు గిరిజన రైతులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక ఇవ్వాలి.

- సి.పి.ఎం. విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విశాఖపట్నం అక్టోబర్ 04. :** రాష్ట్రంలో టిడిపి జనసేన బిజెపి కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక సరఫరా చేసి భవనిర్మాణ కార్మికులను, నిర్మాణ రంగాన్ని సంక్షోభం నుండి బయటపడేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం .జగ్గు నాయుడు డిమాండ్ చేశారు.జిల్లాలో ఉచిత ఇసుక విధానం అమలు చేయాలని, ఇసుక కొరతను నివారించాలని కార్మికులకు సంక్షేమ బోర్డు పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు ప్రదర్శన, అనంతరం ధర్నా జరిగింది. ధర్నాను ద్దేశించి ఎం జగ్గునాయుడు మాట్లాడుతూ జిల్లాలో ఇసుక కొరత తీవ్రంగా ఉంది .ప్రజలు కొందామంటేఇసుక దొరకడం లేదు. ధరలు రెట్టింపు అయ్యాయి. నిర్మాణాలు పెద్ద ఎత్తున నిలిచిపోయాయి 50,000 మంది కార్మికులకు ఉపాధి పోయింది. ఆర్థిక ఇబ్బందుల్లో పడ్డారు. నిర్మాణరంగం మీద ఆధారపడిన ఇతర వ్యాపారాలు దెబ్బతిన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉచిత ఇసుక విధానం అమలు చేయాలి ఇసుక అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు.కూటమి ప్రభుత్వం వచ్చేనా టికి రాష్ట్రంలో టన్ను ఇసుక ధర 1070 రూపా యలు ఉండేది .నేడు అది 2000 నుండి 2300 అయింది. రెండున్నర యూనిట్ల ఇసుక 12000 రూపాయలు ఉండేది. నేడది 22 నుండి 24,000 అయింది. ఒక సిమెంట్ బస్తా ధర 370 రూపాయలు ఉంటే ఒక ఇసుక బస్తా ధర 300 నుండి 350 ఉంది. ఇసుక ధర పెరుగుదల తీవ్రతకు ఇది అద్దం పడుతోందన్నారు.వరదలు వలన ఇసుక తీత నిలిచిపోయిందని ప్రభుత్వం చెబుతోంది. ఒరిస్సా లోను వరదలు వచ్చాయి. మరి ఒరిస్సా నుండి విశాఖకు ఇసుక ఎలా వస్తున్నదని ఆయన ప్రశ్నించారు. స్థానిక గెడ్డలు, నదులలో ఇసుక వెలికి తీత ఎందుకు నిలిపివేశారని ప్రశ్నించారు. ఆన్లైన్లో ప్రజలు బుకింగ్ చేసుకోవచ్చని ప్రభుత్వం చెబుతోంది. కానీ ఈ బుకింగ్ రాజకీయ అధికార అండతో ఇసుక మాఫియా కు అడ్డాగా మారింది. రాత్రికి రాత్రి వీరు బుకింగులు చేసేస్తున్నారు. సాధారణ మధ్యతరగతి ప్రజలకు ఇసుక అందుబాటులో ఉండటం లేదు. జిల్లాలోని భీమిలి ,అగనంపూడి ముసర్లోవ స్టాక్ యార్డులో ఇసుక లేదు. రాజ మండ్రి, శ్రీకాకుళం నుండి రావలసిన ఇసుక రావడం లేదు.నిర్మాణాలు ఆగిపోయి కార్మికులతో పాటు వీరూ ఆర్థిక ఇబ్బందులు పడుతు న్నారన్నారు. ప్రభుత్వం చెబుతున్న దానికి ఆచరణకు పూర్తి విరుద్ధంగా ఉందన్నారు.వైసిపి ప్రభుత్వం నదులు, గెడ్డలుఇసుక దోపిడీ చేస్తోంది. ప్రజలను దోచుకుంటోంది. ఇసుక మాఫియా పెరిగిపోయింది. మాకు అధికారం ఇవ్వండి ఉచిత ఇసుక ఇస్తాం .ప్రజల ఇళ్ల వద్దకే సరఫరా చేస్తాం. దళార్లు లేకుండా చేస్తాం. ఇసుక మాఫియాను భూస్థాపితం చేస్తామని ఎన్నికల్లో టిడిపి జనసేన బిజెపి కూటమి హామీ ఇచ్చింది. ప్రజలు నమ్మి కూటమికి బ్రహ్మరథం పట్టారు. కానీ నమ్మిన ప్రజల ఆశలకు అనుగు ణంగా కూటమి ఇసుక విధానం అమలు లేదు. ఈ పద్ధతిని వెంటనే మార్చుకొని ఉచిత ఇసుక అమలు చేసి, ఇసుకను ప్రజలకు అందుబాటు లోకి తేవాలని ఆయన డిమాండ్ చేశారు.
భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలు గత జగన్ ప్రభుత్వం నిలిపివేసి కార్మికులకు వీరి కుటుంబాలకు అన్యాయం చేసింది. ఓటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంక్షేమ బోర్డు పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజులు అయిన సందర్భంగా ఇది మంచి ప్రభుత్వం అని సభలు పెడుతున్నారు. తను ఇచ్చిన హామీ ప్రకారం ఉచిత ఇసుక ఇవ్వకుండా సంక్షేమ బోర్డు పథకాలు అమలు చేయకుండా ఈ ప్రభుత్వం మంచి ప్రభుత్వం ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. తక్షణమే సంక్షేమ బోర్డు పథకాలు అమలు చేసి భవనిర్మాణ కార్మికులను వీరి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సభకు సి.పి.ఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యు లు బి జగన్ అధ్యక్షత వహించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి గంగారావు,ఆర్కే ఎస్ వి కుమార్, బి ఈశ్వరమ్మ, జిల్లా నాయకులు బి రమణ ఎం సుబ్బారావు పి పైడ్రాజు ఏ నరేంద్ర కుమార్ ,అప్పలరాజు భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు కే అనసూయ , శ్రీనివాసరావు, బి వెంకటరావు మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానం అమలు సంక్షేమ బోర్డు పథకాలు అమలు అయ్యేవరకు కార్మికుల పక్షాన ప్రజల పక్షాన సిపిఎం పార్టీ నిలుస్తుందని, ప్రభుత్వం స్పందించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేయక తప్పదని హెచ్చరించారు. ఇంతటి ఆర్థిక ఇబ్బందులలో కూడా నేటి నిరసన ప్రదర్శన ధర్నాల్లో జిల్లా నలుమూలల నుండి పాల్గొన్న కార్మికులందరికీ అభినందనలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో భవనిర్మాణ కార్మిక సంఘం నాయకులు అప్పలరాజు, ఆదినారాయణ, నరసింగరావు, గోపాలకృష్ణ ,మల్లేష్ ,రమణ, లక్ష్మణరావు ,రామకృష్ణ, పెంటారావు ,పోలా రావు ,ప్రకాష్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# లంబశింగి పంచాయతీ లో రోడ్డు లేక శవాన్ని చీకటి లో డోలిమోత





**చింతపల్లిపెన్ పవర్ అక్టోబర్ 4:-** చింతపల్లి మండలం లమ్మసింగి పంచాయితి జలగలగేడ్డ గ్రామానికి చెందిన కొర్ర బాబూరావు గారి భార్య కొర్ర నీలమ్మ గత మూడు వారాల క్రిందట పాము కాటుకు గురయి రెండు కిడ్నీలు పడైపోయయి విశాఖపట్నం KGH హాస్పిటల్ కి వైద్యం పొందుతూ కొర్ర నీలమ్మ ఈ నెల 2తేది మరణించింది. మరణించిన తరువాత ఇంటికి తరలించడానికి రోడ్డు లేక సుమారు 2 Km. అడవి దారి నుండి వెదురు డోలీమోత మేయడం జరిగింది. సుమారు 40 సంవత్సరం ల నుండి జలగలగెడ్డ గ్రామంలో నివశిస్తున్నాం కానీ ఈ రోడ్డు సమస్యను పై అధికారులు స్పందించలేదు. ఇక మీదటనైనా పై అధికారులు స్పందించి ఈ రోడ్డు సమస్యను దయచేసి పరిష్కరిస్తారని గ్రామ ప్రజలు కోరుచున్నారు



# వాకర్స్ క్లబ్బుల కృషి అభినందనీయం...ఎమ్మెల్యే విజయ్ చంద్ర





**పార్వతీపురం పెన్ పవర్ అక్టోబర్ 4:** జిల్లా కేంద్రంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆరోగ్యం, సామాజిక కార్యక్రమాలకు కృషి చేస్తున్న సభ్యులు అభినందినీయులని ఎమ్మెల్యే విజయచంద్ర కొనియాడారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నోబుల్ వాకర్స్ క్లబ్ సభ్యులతో కలిసి ఆయన మార్నింగ్ వాక్ చేశారు. నిరంతరంగా సభ్యులు ఆరోగ్య సాధనకు దృష్టి సారించడం ఆదర్శనీయమని, వారు నడుస్తూ మరి కొంతమందిని నడిపించడం అందరికీ ఆరోగ్యం పంచడమే అని అన్నారు. వారితో కలిసి కొంత సమయం ఆరోగ్య సాధన వ్యాయామాలు చేశారు. భవిష్యత్తులో మరింతమంది నడక కి రావడంతో పాటు సామాజిక కార్యక్రమాలను చురుకైన పాత్ర పోషించేలా మరింత కృషి చేయాలని సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.




# పీఎం జన్ మన్ గృహ లబ్ధిదారులకు అవగాహన




## గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని లబ్ధిదారులకు సూచన

**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, అక్టోబర్ 4:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ గుండ్ర బైలు గ్రామంలో స్థానిక సర్పంచ్ కేలేబు కుమారి, గృహ నిర్మాణ శాఖ ఏఈ సెగ్గే సూరిబాబు ఆధ్వర్యంలో పీఎం జన్ మన్ గృహ లబ్ధిదారులకు గృహ నిర్మాణానికి సంబంధించి అవగాహన కల్పించారు. అలాగే గృహ నిర్మాణానికి సంబంధించి తగు సూచనలు సలహాలు చేసి మార్కింగ్ ఇవ్వటం జరిగింది. అనంతరం వారు లబ్ధిదారులతో మాట్లాడుతూ పీఎం జాన్ మాన్ గృహ నిర్మాణాలకు నిర్మాణాలు జరిగిన వెంటనే బిల్లులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు అందరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కేలేబి కుమారి, గృహ నిర్మాణ శాఖ ఏఈ సెగ్గే సూరిబాబు, వర్క్ ఇన్స్పెక్టర్ పి చిట్టి పడాల్, గ్రామ పెద్దలు కె. భగత్రం, కె రాజ్ కుమార్, కే. జలంధర్, వి రామదాస్ తదితరులు పాల్గొన్నారు.

# పాచిపెంటలో "కామ్రేడ్ ఏచూరి సీతారాం" కు ఘన నివాళులు





**పాచిపెంట పెన్ పవర్ అక్టోబర్ 4:** పాచిపెంట మండల కేంద్రంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు సూకురు అప్పలస్వామి ఆధ్వర్యంలో సిపిఎం జాతీయ కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణానికి నివాళులర్పిస్తూ ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ సీతారాం ఏచూరి మరణం ప్రజా ఉద్యమాలకు, రైతాంగానికి, ప్రపంచ కార్మిక వర్గానికి తీరని లోటు అని అన్నారు. అన్ని రాజకీయాలు పార్టీలు సంబంధించిన నాయకులు కూడా సీతారాం ఏచూరి వ్యక్తిత్వం కొనియాడుతూ సభలు సంతాపం తెలియజేస్తూ నివాళులర్పిస్తున్నారని, ఈ దేశంలో లౌకికవాదం కోసం అలాగే జాతీయ ఉద్యమ స్ఫూర్తితో పోరాడి సాధించుకున్న హక్కులను ప్రభుత్వం కాపాడటంలో అటువంటి పోరాటాల్లో సీతారాం ఏచూరి కీలక పాత్రని అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటు కరణకు వ్యతిరేకంగా పోరాడారని దేశం గొప్ప నాయకుడుని కోల్పోయింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు, సుర్రు రామారావు, సుబ్బారావు, మహిళ సంఘం నాయకురాలు పాల్గొన్నారు.

# తోటలో ఉచిత వైద్య శిబిరం




**కురుపాం ,గుమ్మలక్ష్మీపురం పెన్ పవర్ అక్టోబర్ 04 :** మన్యం జిల్లా గుమ్మలక్ష్మిపురం మండలంలోని తాడికొండ పంచాయతీ తోట గిరిశిఖర గిరిజన గ్రామంలో రాఫా ఫౌండేషన్ మరియు మధుశ్రీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిభిరం నిర్వహించడం జరిగింది. ఈ శిభిరానికి వైరల్ జ్వరాలు, తలనొప్పి, జలుబు, దగ్గు, ఒళ్ళు, కీళ్లు, ఒంటి నొప్పులతో బాధపడుతూ వచ్చిన 84 మందికి మధుశ్రీ హెల్త్ కేర్(క్లీనిక్) వైద్యులు రవికుమార్ వైద్య తనిఖీలు నిర్వహించారు. అలాగే మందులను అందించారు. ఈ సందర్భంగా రాఫా ఫౌండేషన్ డైరెక్టర్ ప్రవీణ్ కంటి మహంతి ఆ గ్రామ గిరిజనులతో మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రాథమికంగా తాము అందించిన వైద్యసేవలతో నయం కాకుంటే సమీపంలోని ఆసుపత్రుల వద్దకు వెళ్లి మెరుగైన వైద్య సేవలు పొందాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాఫా ఫౌండేషన్ ప్రతినిధి జి.పెంటయ్య తదితరులున్నారు.

# రాష్ట్ర మంత్రి దృష్టికి ముంచంగిపుట్టు సమస్యలు




- సమస్య పరిష్కారించాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారికు మంత్రి ఆదేశాలు
- రోడ్లు, విద్యుత్ సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి
- గిరిజన సంఘం జిల్లా నాయకులు కొర్ర త్రినాథ్, గిరిజన సంఘం ముంచంగిపుట్టు మండల అధ్యక్షుడు ఎం ఎం శ్రీను.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబరు 04.** గిరిజనుల సమస్య పరిష్కారానికి రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎండి ఫరూక్ ఐటిడిఏ ప్రాజెక్టు అధికారికు ఆదేశాలు ఇచ్చినట్లు గిరిజన సంఘం జిల్లా నాయకులు, లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్, గిరిజన సంఘం ముంచంగిపుట్టు మండల అధ్యక్షుడు ఎంఎం శ్రీను అన్నారు. అత్యంత మారుమూల ముంచంగిపుట్టు మండలం, లక్ష్మీపురం, కించాయిపుట్టు పంచాయతీ పలు గ్రామాల్లో రహదారి సౌకర్యం కల్పించాలని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరుక్ కు వినతి పత్రం అందజేశామన్నారు. ఈ సంధర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ.. మంగళగిరి ఎన్టీఆర్ ట్రస్టు భవనం లో జరిగిన ప్రజా సమస్య పరిష్కార వేదికలో లక్ష్మీపురం, కించాయిపుట్టు గ్రామ పంచాయితీలో రోడ్లు మంజూరు చేయాలనీ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎండి ఫరుక్ కు వినతి పత్రం అందజేసినట్లు వారు తెలిపారు. లక్ష్మీపురం పంచాయతీ దొరగూడ,బొక్కయిగూడ తో పాటు కించాయిపుట్టు పంచాయితీ తేనెలమామిడి, కించాయిపుట్టు నుండి మినుములపుట్టు వరకు బిటి రోడ్లు నిర్మాణం చేయాలనీ మంత్రిని విన్నవించుకున్నామని వారు అన్నారు. దొరగూడ, బొక్కయిగూడ, తేనెలి మామిడి గ్రామాల్లో రోడ్డు సౌకర్యం లేక అత్యవసర పరిస్థితిలోప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, దొరగూడ లో విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరమన్నారు. వినతి పత్రాన్ని స్వీకరించిన మంత్రి ఈ విషయం పై స్పందించి వెంటనే అల్లూరి జిల్లా ఐటీడీఏ పిఓఅభిషేక్ కీ ఫోన్ చేసి ఆయా గ్రామాల్లో రోడ్లు నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాలకు స్పందించిన పిఓ రోడ్లు నిర్మాణం కోసం చర్యలు తీసుకొంటామని మంత్రి ఫరుక్ ఫోన్ లోనే సమాధానం తెలిపారు. మంత్రికి వినతి పత్రం అందజేసిన వారిలో కిల్లో లక్ష్మణ్ పాల్గొన్నారు.

## సర్పంచ్ పూర్ణిమ అధ్యక్షతన గ్రామసభ



**స్టాఫ్ రిపోర్టర్,హుకుంపేట పెన్ పవర్,అక్టోబర్ 4:** అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట పంచాయతీ కేంద్రంలో స్థానిక సర్పంచ్ సమీడా వెంకటపూర్ణిమ అధ్యక్షతన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై గ్రామసభ నిర్వహించటం జరిగింది.ఈ గ్రామ సభలో పంచాయతీలోని పారిశుధ్యం, ఎంజిఎన్ఆర్జిఎస్ పథకం ద్వారా పనులు చేపట్టుకోవడం కొరకు గ్రామసభ నిర్వహించి గ్రామ సభలో తీర్మానాలు చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూర్ణిమాతో పాటు ఎంపీటీసీ రమా, సెక్రటరీ సాగర్, ఎంజిఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది ఈసీ శంకర్రావు, టెక్నికల్ అసిస్టెంట్ చందూపడాల్, వీఆర్పీ రామయ్య,వార్డ్ మెంబర్లు నాగబాబు,లక్ష్మణ్, నాయకులు అనిల్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపాకల గ్రామ మాజీ వాలంటరీ మృతి

శ్రద్ధాంజలి ఘటించిన:- పోతురాజు బాలయ్య జడ్పీటిసి




**చింతపల్లి పెన్ పవర్ అక్టోబర్ 4 :-** లోతుగడ్డ పంచాయతీ కొత్తపాకలు గ్రామ వాలంటరీ పొంగి బాలకృష్ణ కాలం చేసి ఉన్నారు.అది తెలిసి కొత్తపాకలు గ్రామం వెళ్లి ఆ కుటుంబాన్ని పరామర్శించిన చింతపల్లి జెడ్పీటిసి పోతురాజు బాలయ్య.బాలకృష్ణకు ఇద్దరు పిల్లలు,భార్య, తల్లి ఉన్నారు.బాలకృష్ణ దివ్యాంగుడు.చాలా బాధాకరం.బాలకృష్ణ ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ, ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## శ్రీ శక్తి పంచాయతన ఆలయంలో గాయిత్రి దేవి గా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు.......



**నాతవరం పెన్ పవర్ (అక్టోబర్ 04):** మండల కేంద్రమైన నాతవరంలో తాండవ కాలువ గట్టుపై వెలసిన శ్రీ శక్తి పంచాయితన ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజైన శుక్రవారం అమ్మవారు గాయత్రి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం కావడంతో భక్తులు, భవానీలు,మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని,ముఖ్యంగా మహిళలు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు.భక్తులు ఈ తొమ్మిది రోజులపాటు వివిధ రూపాలలో అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందవలసిందిగా ఆలయ నిర్వాహకులు తెలియజేశారు.

# పారాది వంతెన నిర్మాణానికి శ్రీకారం





**బొబ్బిలి పెన్ పవర్ అక్టోబర్ 4:** బొబ్బిలి మండలం, పారాది గ్రామం వద్ద వేగావతి నదిపై వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే.రంగారావు(బేబీ నాయన) చేతులమీదుగా పనులు పునఃప్రారంభించారు. మాజీ మంత్రి సుజయ్ కృష్ణ రంగారావు గతంలో మంజూరు చేయించిన నిధులకు అదనంగా 6 శాతం జీఎస్టీ మరియు డైవర్షన్ రోడ్డుకి కలిపి ఇప్పుడు రూ. 13,40,00,000 తో నిర్మాణం ప్రారంభించారు. రెండు రాష్ట్రాల రహదారులకు ప్రధాన మార్గం అయిన ఈ వంతెన యొక్క సమస్య తీవ్రతను ఎమ్మెల్యే బేబీనాయన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిసి వివరించి, త్వరితగతిన నిధులు మంజూరు అయ్యేలా సహకరించాలని కోరారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బేబీనాయన మాట్లాడుతూ తమ తాత ఉమ్మడి మద్రాసు రాష్ట్రం ముఖ్యమంత్రి ఉన్నప్పుడు నిర్మించినటువంటి ఈ వంతెన పునఃనిర్మాణ పనులు తన హయాములో జరగడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు తెలిపారు. వంతెన నిర్మాణం వచ్చే ఏడాది వర్షాకాలంలోపు పూర్తిచేసే విధంగా చూడాలని ఎమ్మెల్యే బేబీనాయన అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, రొంపిల్లి గ్రామ సర్పంచ్ బవిరెడ్డి శంకర్రావు, పారాది గ్రామ పెద్దలు, ప్రజలు మరియు ఆర్ %డ% బి అధికారులు పాల్గొన్నారు.



# ప్రతి పల్లెను, ప్రతి వార్డుని అభివృద్ధి చేయడమే లక్ష్యం...ఎమ్మెల్యే విజయ్ చంద్ర

**పార్వతీపురం పెన్ పవర్ అక్టోబర్ 4:** పార్వతీపురం నియోజకవర్గంలోని ప్రతి పల్లెను, ప్రతి వార్డుని దశలవారీగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు ఎమ్మెల్యే విజయ్ చంద్ర అన్నారు. సీతానగరం మండలం పెదంకలాం గ్రామంలో 67 లక్షల రూపాయలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రాలను ఎమ్మెల్యే విజయ్ చంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడాతూ ఎన్నికల్లో గ్రామస్తులు తనను ఎంతగానో ఆదరించారని, మళ్ళీ ఆ రుణం తీర్చుకోవడానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నానని, అందులో భాగంగా బూజు పట్టి ఉన్న ఈ రెండు భవనాలను సిద్ధం చేసి ప్రారంభించి మీకు అంకితం చేస్తున్నానని ఎమ్మెల్యే అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి రావలసిన నిధులతో పాటు అభివృద్ధికి ఎంతవరకు నిధులు అవసరమో వాటన్నింటినీ పోరాడి అయినా సరే తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేసుకునేందుకు ప్రయత్నిస్తానని, యువకులు, మహిళలు, వృద్ధులు, రైతులు ఇతర చేతివృత్తుల వారు అన్ని వర్గాల వారి అభివృద్ధి తన ధ్యేయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, టిడిపి జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ధాన్యలక్ష్మీదేవి అవతారంలో అమ్మవారు




**గాజువాక: పెన్ పవర్ ,అక్టోబర్ 04** జీవీయంసి 65 వ వార్డు వాంబే కాలనీ లో గరుడాద్రి కొండపై వెలసిన శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని ధాన్యలక్ష్మి అవతారాలలో ఈరోజు రెండవ రోజు అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త మంత్రి మంజుల, ఆలయ చైర్మన్ దొడ్డి రమణ, ఆధ్వర్యంలో నిర్వహించారు. రమణానంద ఆచార్యులు పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకులు ప్రదిప్ చంద్ర , సహాయ అర్చకులు తాతయ్య చార్యులు నేతృత్వంలో పూజా కార్యక్రమాలు నిర్వహించబడును. భక్తులు అమ్మవారి నవరాత్రుల లో భాగముగా ఒక్కొక్క అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చే విధంగా అలంకరణ జరగుతుందని నిర్వాహకులు తెలిపారు. అక్టోబర్ 06 తేదీ ఉదయం 8 గంటల నుండి సుదర్శన హెూమం జరుపబడును ఈ కార్యక్రమంలో భక్తులందరూ భక్తిశ్రద్ధలతో పాల్గొని అమ్మవారి దర్శించుకుని అమ్మవారి కరుణ కటాక్షాలు అందుకుంటారని అమ్మవారి కృపకు పాత్రులు అవుతారని ఆలయం కమిటీ సభ్యులు కోరారు . ఈ కార్యక్రమంలో ఆళ్ల శ్రీను, వందూరి సత్యవతి,బి. ఉషారాణి, హిమజ, వరలక్ష్మి, చిట్టెమ్మ, నాగమణి, కే భవాని, సంతు, వై చిన్నమ్మలు, ఏ.కాంతమ్మ, కె. లక్ష్మమ్మ, ఎం.గవర్ లక్ష్మి,జి. పద్మావతి, చాముండేశ్వరి, జి .కుమారి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు..

## ఆదివాసీలు జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డీకే హిమబిందు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,అక్టోబర్ 4:** ఆదివాసీలు జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని దారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డీకే అన్నారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మాదిగమల్లు గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో జ్వరాలు ఇతర రోగాలతో బాధపడుతున్న 64 మందికి వైద్యాధికారి ఆరోగ్య తనిఖీలు చేశారు.ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఆదివాసులు జ్వరాలపై నిర్లక్ష్యం చేయరాదు అన్నారు.జ్వర బాధితులు సకాలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. మలేరియా వ్యాధి నిర్ధారణ జరిగితే క్రమంగా మందులు వాడాలి అన్నారు.ప్రస్తుతం వాతావరణంలో కలిగిన మార్పుల వల్ల గ్రామాల్లో వైరల్ జ్వరాలు అధికంగా ప్రవర్తన అన్నారు.గ్రామాల్లో ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవడం వల్ల వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని ఆమె తెలిపారు.ప్రధానంగా గిరిజనులు కాచి వడబోసిన నీళ్లను మాత్రమే తాగాలని, నిలువ ఆహారం తీసుకోరాదని, వేడిగా ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్ హెచ్ పి బావన కుమారి,ఏఎన్ఎం మత్స్యకొండ సీత పాల్గొన్నారు.

# దుర్గమ్మ ఆలయానికి పావు కేజీ వెండి బహుకరణ

అనిశెట్టి చిరంజీవి శ్రీలక్ష్మి దంపతుల వితరణ



**కొయ్యూరు,పెన్ పవర్ అక్టోబర్ 4:** దేవి నవరాత్రులు సందర్భంగా కొయ్యూరు దుర్గమ్మ ఆలయానికి కొయ్యూరు కు చెందిన అనిశెట్టి చిరంజీవి, శ్రీలక్ష్మి దంపతులు పావు కేజీ వెండి బహుకరించారు.దేవీ నవరాత్రుల సందర్భంగా కొయ్యూరు గ్రామంలో శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో రెండో రోజు అనిశెట్టి చిరంజీవి, శ్రీ లక్ష్మి దంపతులుచే లక్ష్మీ గణపతి హెూమం, చండీ హెూమం, మహా రుద్ర హెూమం మరియు శ్రీచక్ర అర్చన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ చక్ర అర్చనకు పావు కేజీ వెండిని చిరంజీవి దంపతులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వేద పండితులు, శివాలయం పంతులు, దుర్గమ్మ పంతులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# సిట్ మీద హిందువులు ఎవ్వరికీ నమ్మకం లేదు.

- ఒక ఇండిపెండెంట్ ఏజెన్సీ ద్వారా దీనిపై దర్యాప్తు జరపాలి
- వై.యస్.ఆర్ కాంగ్రెస్ మొదటి నుంచీ డిమాండ్ చేస్తోంది.
- నేడు సుప్రీం కోర్టు ఒక ఇన్వెస్టిగేషన్ కమిటీని నియమించ డాన్ని స్వాగతిస్తున్నాం.
- భక్తుల అనుమానాలు నివృత్తి కావాలంటే ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ ఇండి పెండెంట్‌గా ఉండాలి.
- వాస్తవాలు ఏమిటో ప్రజలకు తెలియాలన్నదే మా అభిప్రాయం.
- గుడివాడ అమర్నాథ్ , విశాఖ జిల్లా వై.యస్. ఆర్.సీపీ అధ్యక్షులు



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం అక్టోబర్ 04 :** రాష్ట్ర ప్రభుత్వం వేసినటువంటి సిట్ మీద ప్రజలకు గాని ముఖ్యంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్నటువంటి హిందువులు కానీ నమ్మకం లేదు ఒక ఇండిపెండెంట్ ఏజెన్సీ ద్వారా దీని మీద ఎంక్వైరీ జరగాలని చెప్పి మొదటి నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుంది.

అందులో భాగంగా ఈరోజు సుప్రీంకోర్టు పాస్ చేసినటువంటి ఆర్డర్స్ ప్రకారం ఒక ఇండిపెం డెంట్ ఏజెన్సీ ముఖ్యంగా ఇద్దరు సి.బి.ఐ అధికారులు ఇద్దరు రాష్ట్రంలో ఉన్నటువంటి పోలీస్ అధికారులు ఒక ఎఫ్ఎస్ఎస్ ఏఐ ఏదైతే ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఏదైతే ఉందో దానికి సంబంధించిన టువంటి ఒక అధికారిని కూడా నియమిస్తూ 05 మంది తో ఒక ఇండిపెండెంట్ ఇన్వెస్టిగేషన్ కమిటీని నియమిస్తూ ఎందుకంటే దీని మీద కోట్లాదిమంది భక్తులకు సంబంధించినటువంటి అనుమానాలు నివృత్తి చేసేటువంటి దానికి ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ ఇండిపెండెంట్గా ఉండాలని అటువంటి సుప్రీంకోర్టు ఆలోచనని హృదయ పూర్వకంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ , పార్టీగా వ్యక్తిగతంగా కూడా అందరం కూడా స్వాగతి స్తున్నాం. ఏది ఏమైనప్పటికీ ఇందులో వాస్తవా లు ఏంటి అనేటువంటిది తెలియాల అభిప్రా యం. ఎందుకంటే దీన్ని ఏ రకంగా రాజకీయంగా వాడుకునేటువంటి ప్రయత్నం ఇప్పుడు ఈరోజు రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రభుత్వం వాడు తుందో అనేటువంటిది మనం చూసాం ముఖ్యంగా దానిమీద గతంలో సుప్రీం కోర్ట్ చేసినటువంటి వ్యాఖ్యలు కూడా మనం చూసాం దీన్ని రాజకీయంగా వాడుకోవడానికి వీల్లేదు ఒక ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి దీని మీద ఈ రకమైనటువంటి ఆరోపణ చేయడం అయినటువంటిది సమంజసం కాదు దేవుని దయచేసి రాజకీయాల్లోకి లాగోదు అనేటువంటి మాట గతంలో సుప్రీంకోర్టు వ్యాఖ్యలు చేసిందో దాన్ని అందరు కూడా ప్రపంచం అంతా కూడా చూసింది. ఏదేమైనప్పటికీ తిరుమల తిరుపతి అనేటువంటిది హిందువులకు సంబంధించి 120 కోట్ల మంది హిందువులకు సంబంధించిన టువంటి ఆరాధ్య కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వ ర స్వామి దీనికి సంబంధించి లేనిపోయినటు వంటి ఆరోపణలు చేసి భక్తులకు లేనిపోయి నటువంటి అనుమానాలు సృష్టించి లేనిపోయి నటువంటి ఇబ్బందులు కలిగించడం అయిన టువంటి సమంజసం కాదు ఇప్పటికన్నా సుప్రీం కోర్టు ఇచ్చినటువంటి ఆర్డర్ని తీసుకున్నటు వంటి నిర్ణయాన్ని హృదయపూర్వకంగా నాకు తెలిసి ప్రజలందరూ కూడా స్వాగతిస్తున్నారు.

తద్వారా ఇందులో నిజాలు అన్ని బయటకు రావాలని ప్రజలకు అన్ని తెలియాలని ముఖ్యం గా భక్తులు తాలూకా ఆలోచనని వారు మనోభా వానికి గౌరవిస్తూ తీసుకున్నటువంటి నిర్ణయాన్ని హృదయ పూర్వక గా వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తున్నాం

# అన్నవరం, తమ్మంగులపంచాయతీ లో చెక్ డాం కాలువకు మరమ్మతు చేయించండి

- 500 ఎకరాల సాగు భూమిలో పొట్టు దశలో ఉన్న పంటకు నీటిని అందించండి గ్రామాల ప్రజలు వేడుకలు





**చింతపల్లి పెన్ పవర్ అక్టోబర్ 4 :** సుమారు 500 ఎకరాల సాగు భూమిలో పొట్టు దశలో ఉన్న పంటకు చెక్ డాం నుంచి కాలువ ద్వారా సక్రమంగా నీటి సదుపాయం కల్పించాలని అన్నవరం తమ్మంగుల పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తమ్మంగుల పంచాయతీలోని దొంగలొయ్య గ్రామ సమీపంలో ఉన్న చెక్ డాం నుంచి వచ్చే సాగునీరుతో దొంగలొయ్య గ్రామంతో పాటు అన్నవరం పంచాయతీలోని కట్టు బంధ, అన్నవరం గ్రామాల రైతుల భూములకు సాగునీరు అందేదని, కాగా ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా చెక్ డాం నుంచి కాలువల ద్వారా వచ్చే సాగునీరు మధ్యలో కొండ చరియలు విరిగిపడడంతో దిగువ ప్రాంతాలలో ఉన్న కట్టు బంధ, దొంగలొయ్య గ్రామస్తులు సాగు చేసుకుంటున్న భూములకు నీరు అందడం లేదని వాపోయారు. ఇదే విషయమై ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిని అన్నవరం సర్పంచ్ పాంగి సన్యాసిరావు ఆధ్వర్యంలో స్పందనలో కలిసి వినతిపత్రం సమర్పించామని పేర్కొన్నారు. సుమారు 500 ఎకరాల మాగాని పొట్టు దశలో ఉందని ఇలాంటి దశలో పొలాలకు సాగునీరు అందకపోతే తాము తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం స్థానిక సర్పంచ్ సన్యాసిరావు మాట్లాడుతూ దొంగలొయ్య చెక్ డాం నుంచి సుమారు మూడు కిలోమీటర్ల మేర కాలువ ఉందని, దాని ద్వారా వచ్చే నీటితోనే దిగువ ప్రాంతాలలో గ్రామాలు వ్యవసాయం చేసుకుంటున్నాయని, కాగా ఇటీవల కురిసిన వర్షాల కారణంగా కొండ చరియలు విరిగిపడి పలుచోట్ల కాలువ మూసుకుపోయిందని దీంతో దిగువ ప్రాంతాలకు వెళ్లాల్సిన సాగునీరు వృధా అయిపోతుందని తెలిపారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి కాలువ మరమ్మతు పనులు చేపట్టి దిగువ ప్రాంతాలకు కాలువ ద్వారా సాగునీరు సక్రమంగా వెళ్లే విధంగా చేయగలరని కోరారు.

# కే.జీ.హెచ్. లో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు.







## వన్ స్టాప్ సెంటర్,చిన్నపిల్లల వార్డు సందర్శన

## ఖైదీల చికిత్స కోసం కేటాయించిన బెడ్ల వివరాలపై ఆరా

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్,విశాఖపట్టణం,అక్టోబ ర్ 04 :**స్థానిక కే.జీ.హెచ్ లో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆకస్మిక తనిఖీలు చేశారు. శు క్రవారం సాయంత్రం కే.జీ.హెచ్ కు వెళ్లిన ఆయన ముందుగా వన్ స్టాప్ సెంటర్ను సంద ర్శించారు. అక్కడ అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఉద్యోగుల విధి నిర్వహణ, సిబ్బంది జీతభత్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిన్నపిల్లల వార్డును సందర్శించి అక్కడ పరిస్థితులను గమనించారు. ఆధునికీ కరణ, ఇతర పనుల గురించి కే.జీ.హెచ్ సూప రింటెండెంట్, ఇతర వైద్యాధికారులతో మాట్లా డారు. ఇటీవల కేంద్ర కారాగారం సందర్శనలో ఖైదీలకు కేటాయించిన బెడ్లు సరిపోవటం లేదని అక్కడి అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చిన నేపథ్యంలో ఆ విషయమై కే.జీ.హెచ్ అధికారు లను ఆరా తీశారు. రాజేంద్రప్రసాద్ వార్డులో ఇప్పుడున్న బెడ్ల సంఖ్యను పెంచాలని, ఖైదీలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం వివిధ వార్డుల్లో తిరిగిన ఆయన అక్కడ పరిస్థితులను గమనించారు. వైద్యసేవల విస్తరణ, వసతుల కల్పన, భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై కేజీహెచ్ వైద్యాధికారులకు దిశానిర్దేశం చేశారు. పర్యటనలో ఆయన వెంట కే.జీ.హెచ్ సూపరిం టెండెంట్ డా. కె. శివానంద, ఐసీడీఎస్ పీడీ జయదేవి, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ నాయుడు, ఇతర అధికారులు, కేజీహెచ్ వైద్యాధికారులు తదితరులు ఉన్నారు.

# నాతవరం శ్రీ శక్తి పంచాయతన ఆలయంలో వైభవంగా దేవి నవరాత్రి ఉత్సవాలు......





- వేద పండితులచే ప్రతిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నైవేద్యాలు.....
- ప్రతిరోజు 250 మంది భవానీలు కు పది రోజులు పాటు ఉదయం వడి, మధ్యాహ్నం బిక్ష,సాయంత్రం సద్ది ఏర్పాటు......
- దసరా రోజు సుమారు 5000 మందికి మహా అన్న సమారాధన....
- శ్రీ శక్తి పంచాయతన ఆలయ ధర్మకర్త (ఎన్నారై) శెట్టి సతీష్......

**నాతవరం పెన్ పవర్ (అక్టోబర్ 04):** మండల కేంద్రమైన నాతవరం తాండవ కాలువ గట్టు పై నిర్మితమైన శ్రీ శ్రీ శ్రీ శక్తి పంచాయతన ఆలయంలో 3వ సంవత్సరం దేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయని ఆలయ ధర్మకర్త ఎన్నారై శెట్టి సతీష్ అన్నారు.శుక్రవారం ఆలై ధర్మకర్త,ఎన్నారై సతీష్ మీడియాతో మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈ ఏడాది కూడా సుమారు 250 మంది భవానీ మాలాధారణ భక్తులకు నవరాత్రిలు,దసరా రోజు తో కలిపి ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం రాత్రి టిఫిన్ ఏర్పాట్లు చేయడం జరుగుతున్నదని,అలాగే ప్రతి రోజు ఇద్దరు అర్చకులు తో అమ్మ వారికి మంగళ స్నానం, పంచామృతాలతో అభిషేకం చేసి ఒక్కొక్క రోజు ఒక్కో అవతారం లో అలంకరణ చేసి ప్రత్యేక నైవేద్యం పెట్టి పూజా కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయని ఆయన తెలిపారు.అలాగే దసరా ముందు రోజు సుమారు 5000 మందికి మహా అన్న సమారాధన ఏర్పాటు చేయడం జరిగతుందని,నవరాత్రి రోజుల్లో వివిధ రకాల పూజలు, హెూమాలు,పడి పూజ నిర్వహిస్తున్నామని,దసరా రోజు సాయంత్రం అమ్మ వారి నిమజ్జనం లో బాగంగా డప్పులు,కోలాటం, మందుగుండు సామగ్రి తో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడునని ఆలయ ధర్మకర్త ఎన్నారై శెట్టి సతీష్ సతీష్ తెలియజేశారు.ఈ 10 రోజులు దసరా కార్యక్రమాల్లో భవానీ భక్తులకు ప్రతి రోజు టిఫిన్ లేదా భోజనం స్పాన్సర్ చేయాలని అనుకున్న లేదా మహా అన్నసమారాధన కార్యక్రమానికి స్పాన్సర్ చేయాలంటే కమిటీ వారిని సంప్రదించి, అమ్మదయకు పాత్రులు కావాలని సతీష్ మనవి చేశారు.





# బదిలీపై వెళ్తున్న సచివాలయ సిబ్బందికు ఘన సన్మానం

- సచివాలయ కార్యదర్శి, సర్వేయర్ చేసిన సేవలు అపూర్వం
- పంచాయితీ సర్పంచ్ డి పోర్తిమ్మ.





**ముంచంగిపుట్టు, పెన్ పవర్, అక్టోబరు 04.**మండలంలో గల జర్జుల గ్రామ సచివాలయ పరిధిలో కార్యదర్శిగా, సర్వేయర్ గా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై రోలుగుంట గ్రామ సచివాలయానికి వెళుతున్న కార్యదర్శి కే చంద్రకాంత్ పడాల్, సర్వేయర్ శివదాసులకు జర్జుల పంచాయతి సర్పంచ్ డి పోర్తిమ్మ ఆధ్వర్యంలో ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా జర్జుల పంచాయతీ సర్పంచ్ పోర్తిమ్మ మాట్లాడుతూ.. సచివాలయ పరిధిలో గల గ్రామాల ప్రజలకు మంచి సేవలు అందించిన సచివాలయ ఉద్యోగులు సెక్రెటరీ, సర్వేయర్ సేవలు మరువలేనిదని, వారి సేవలు అపూర్వమని కొనియాడారు. తదనంతరం వైసిపి మండల పార్టీ అధ్యక్షులు పాంగి పద్మారావు మాట్లాడుతూ విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తే ఎక్కడ ఉన్న మంచి పేరు ప్రఖ్యాతలు వస్తాయని, విధి నిర్వహణలో అంకితభావంతో ఈ సచివాలయంలో పనిచేసినట్లు రోలుగుంట గ్రామ సచివాలయంలో సైతం విధులు నిర్వహించి మంచి పేరు ప్రఖ్యాతలు పొందాలన్నారు. సచివాలయ పరిధిలో గల గ్రామాల ప్రజలకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందే విధంగా కృషిచేసి గ్రామాల అభివృద్ధికి ఎంతో తోడ్పాటు అందించారన్నారు. బదిలీపై వెళ్తున్న ఇద్దరు సచివాలయ ఉద్యోగులకు అభినందనలు తెలియజేశారు. గ్రామస్తులుతో కలిసి వారిని ఘనంగా సన్మానించమని తెలిపారు.ఈ సన్మాన కార్యక్రమంలో జగన్నాథం పడాల్, చందర్రావు, త్రినాధ్, సచివాలయ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

# నేడు పీఎం కిసాన్ నిధులు విడుదల...

- జిల్లా కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్

**పార్వతీపురం పెన్ పవర్ అక్టోబర్ 04 :** 18వ విడత పిఎం కిసాన్ నిధులు శనివారం విడుదల చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ తెలిపారు. జిల్లాలో 1,14,228 మంది లబ్ధిదారులకు 22.85 కోట్ల రూపాయలను విడుదల కానున్నట్లు చెప్పారు.

మహారాష్ట్రలోని వాసింలో జరుగు కార్యక్రమంలో ప్రధానమంత్రి పిఎం కిసాన్ నిధులను విడుదల చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ వివరించారు.



# సాలూరుకు రైలు సౌకర్యం

**ట్రైల్ రన్ విజయవంతం**



**సాలూరు పెన్ పవర్ అక్టోబర్ 4:**విశాఖపట్నం నుండి సాలూరు పట్టణానికి శుక్రవారం రైలు రావడం జరిగింది. జిల్లా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చొరవతో ఈ రైలు సౌకర్యం సాలూరు ప్రాంతీయులకు కలిగింది. సాలూరు నుండి బొబ్బిలి మీదుగా విశాఖపట్నం ఈ రైలు సౌకర్యం కలదు. శుక్రవారం రైలు ట్రైల్ రన్ విజయవంతంగా జరిగింది దీనితో పట్టణ వాసుల ఆనందంకు అవదులు లేకుండా పోయింది.

# జిల్లాలో ఏడాది పాటు మారిటోరియం ప్రకటించిన కలెక్టర్





**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,పెన్ పవర్,అక్టోబర్ 04:**ఇటీవల వరుసగా వచ్చిన వరదలు, వాసలకు జిల్లా ప్రజలకు, రైతాంగానికి కలిగిన నష్టాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం జిల్లాను ప్రకృతి వైపరీత్యాల జిల్లాగా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ స్పష్టం చేసారు.ఈ నేపథ్యంలో శుక్రవారం కలక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జరిగిని జిల్లా కన్సల్టేటివ్ కమిటీ సమావేశంలో ఏడాది పాటు మారిటోరియం ప్రకటిస్తూ డిసిసి చైర్మన్,జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ నిర్ణయం తీసుకున్నారు.దీని ప్రకారం రైతులు రుణాలను రి-షెడ్యూల్ చేసుకోవచ్చని కలెక్టర్ స్పష్టం చేసారు.ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో మంజూరైన రుణాలపై కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,పేదల జీవన ప్రమాణాల మెరుగుకు బ్యాంకులు సహకారం అందించాలని సూచించారు. పంటలు నష్టపోయిన రైతులకు,కొత్త రైతులను గుర్తించి బ్యాంకులు రుణాలు అందించడానికి ముందుకు రావాలని బ్యాంకర్లను కోరారు. విద్యా రుణాలపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించి అవసరమైన వారికీ విద్యా రుణాలు మంజూరు చేయాలని కోరారు.బంగారు రుణాలు సక్రమంగా అందించడం లేదని గుర్తించిన కలెక్టర్ అందుకు కారణాలను ఆరా తీయగా పలు బ్యాంకు శాఖలలో స్ట్రాంగ్ రూములు లేనందున,అప్రైజర్ సమస్యలతో మంజురుకు ఆటంకం ఉందని తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ ఐటిడిఎల ప్రాజెక్ట్ అధికారులను వారి వారి ప్రాంతాలలో స్ట్రాంగ్ రూములు లేని బ్యాంకు శాఖలను గుర్తించి స్ట్రాంగ్ రూముల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానికంగా అప్రైజర్లను గుర్తించి తీసుకోవాలని సూచించారు.వ్యవసాయ, ఉద్యాన శాఖలు రుణాలపై రైతులకు పూర్తీ స్థాయి అవగాహన కల్పించాలని, అంతర్ పంటలకు రెండు రుణాలు ఇచ్చే అవకాశాన్ని వారికి తెలియజేయాలని సూచిస్తూ,వరితో పాటు కాఫీ, మిరియాలకు కూడా రుణాలు ఇప్పించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా పశు క్రాంతి పథకం క్రింద, పాలు ఇచ్చే పశువులు, పిగ్గరి, చేపల బోటులకు రుణాలు అందించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పిఎంఇజిపి (ప్రైమ్ మినిస్టర్స్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ స్కీం ) పిఎంఎఫ్ఎంఇ (ప్రైమ్ మినిస్టర్స్ ఫార్ములిసాషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రొసీసిగ్ ఎంటర్ప్రిసెస్ ) పథకాల కింద రుణాలు మంజూరు చేయాలన్నారు.మహిళలను లక్షాదికారులుగా తీర్చిదిద్దడానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన లక్ పతి దీది పథకం కింద రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు.ఖరీఫ్ సీజన్లో మొదటి త్రైమాసికానికి 46 శాతం రుణాలు మంజూరు చేయడం పట్ల సంతృప్తి వ్యక్తపరిచిన కలెక్టర్ టర్మ్, ఇతర రుణాలు ఆశించిన స్థాయిలో లేనందున వాటిని తదుపరి త్రై మాసానికి విస్తృత పరచాలని ఆదేశించారు.ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ డా.ఎంజే అభిషేక్ గౌడ్,ఎల్డిఎం మాతునాయుడు, యూనియన్ బ్యాంక్ కన్వీనర్ జివిబిడి హరిప్రసాద్, ఎస్బిఐ రీజనల్ మేనేజర్ అభిషేక్, ఎపిజివిబి చీఫ్ మేనేజర్, బ్యాంక్ కంట్రోలర్స్, డిసిసి కమిటీ సభ్యులైన వ్యవస్యా, ఉద్యాన,పశుసంవర్ధక, పట్టు పరిశ్రమ శాఖల అధికారులు ఎస్బీఎస్ నంద్, పి. రమేష్ కుమార్ రావు, నరసింహారావు,అప్పారావు, పరిశ్రమల అధికారి వానీధర్, పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటిడిఎ ల ప్రాజెక్ట్ అధికారులు వారి వారి కార్యాలయాల నుండి, హైదరాబాద్ నుండి ఆర్ బి ఐ అధికారి గిరిధర్ తదితరులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు.

## ఈనెల 8న చింతపల్లిలో జాబ్ మేళా



**స్టాఫ్ రిపోర్టర్,పాడేరు,పెన్ పవర్,అక్టోబర్ 4:** అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండల కేంద్రంలో చింతపల్లి యువత శిక్షణ కేంద్రం( వైటిసి)లో ఈనెల 8వ తేదీన రాష్ట్ర నైపుణ్యా భివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ శుక్రవారం తెలిపారు. ఈమేరకు ఆయన ఐటీడీఏ పీవో వీ.అభిషేక్, జేసీ డాక్టర్ ఎంజె అభిషేక్ గౌడ్ తో కలిసి జాబ్ మేళాకు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు.పలు ప్రముఖ కార్పొరేట్ కంపెనీలు పాల్గొని నిరుద్యోగ అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు.

## మొక్కు తీర్చుకున్న టిడిపి నాయకులు.



**అరకులోయ పెన్ పవర్ 4 :**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డిఏ కూటమి అధికారంలోకి వస్తే అయ్యప్ప దీక్షలు పూనుతామని మొక్కులో మొక్కుకున్న మాదల పంచాయతీ సర్పంచ్ వంతల శ్రీనివాసరావు, పెదలబుడు పంచాయతీ వార్డ్ సభ్యులు, అరకులోయ నియోజకవర్గ మీడియా కన్వీనర్ కిల్లో నాగరాజు మరి కొంతమంది అరకులోయ టిడిపి శ్రేణులు, మొక్కుబడిని చేర్చుటకు అయ్యప్ప మాలను శుక్రవారం ధరించామని వారు తెలిపారు.అయ్యప్ప మాల ధరించిన టిడిపి నేతలు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని ఈ రాష్టం స్వర్ణాంధ్రగా మారాలనే ఆకాంక్షతో అయ్యప్ప స్వామి మాల ధరిస్తామని మొక్కుకున్నామన్నారు. తమ గోడును అయ్యప్ప స్వామి వారు విన్నారని అందుకే నారా చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ కు మరోసారి ముఖ్యమంత్రి అయ్యారన్నారని. ఎన్నికల్లో స్వామివారికి చేసిన ప్రమాణం ప్రకారం శుక్రవారం అయ్యప్ప మాల ధరించినట్లుగా ఒక పత్రిక ప్రకటనలో వారు తెలిపారు.

## కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రం.



**అరకులోయ పెన్ పవర్ 4:**అరకులోయ నియోజకవర్గం మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో పనిచేయుచున్న వైద్య సిబ్బంది అందరి సమిష్ట కృషితో ఆసుపత్రి యంత్రాంగం శుక్రవారం అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ చేతులు మీదుగా నేషనల్ క్వాలిటీ ఎస్యురన్ స్టాండర్డ్ ధ్రువపత్రాలు అందుకున్నారు. %చీూ×ూచీూూ ుఖూూ×ః ుూూఖూ=ూచీజజు ూూచీణూ=ఋూ% (ఎన్ క్యూ ఏ ఎస్ ) మూల్యకనం అనుగుణముగా ప్రభుత్వ అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రి చిన్నపిల్ల ఓ. పి. వార్డు, ఎస్ ఎన్ సి యు, విభాగాలు, ఎం యు ఎస్ క్యూ ఏ ఎన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తునట్లుగా పరిగణిస్తూ జాతీయ క్వాలిటీ ఎస్యురెన్స్ స్టాండర్డ్ వర్గాలు తెలియజేశారని వారు తెలిపారు. %చీూ×ూచీూూ ుఖూూ×ః ుూూఖూ=ూచీజజు ూూచీణూ=ఋూ (చీూూూ%) తేదీ 23 సెప్టెంబర్ 2023 నుండి 19 అక్టోబర్ 2026 తేదీ వరకు వరకు %చీూూూ/ూఎ%/1034/ఏపీ నంబర్తో రిజిస్ట్రేషన్ చేసి ప్రశంసా పత్రమును జిల్లా కలెక్టర్ కలెక్టర్ జిల్లా మెజిస్ట్రేట్ చేతుల మీదుగా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి బహూకరించారని వారు ఒక పత్రిక ప్రకటనలో శుక్రవారం స్పష్టం చేశారు.

## 15వ ఆర్థిక నిధులతో జాకర వలసలో పనులు..



**అనంతగిరి,పెన్ పవర్ అక్టోబర్ 04 :** టోకూరు పంచాయతీ జాకరవలస గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో సీసి రోడ్డు పనులు ప్రారంభం శుక్రవారం సర్పంచ్ కిల్లో మోస్య ఆదోర్యంలో 2 రెండు లక్షల రూపాయలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో టోకూరు గ్రామ పంచాయతీ మరిన్ని అభివృద్ధి పనులు కోసం నిధులు రాబట్టడానికి నా వంతు కృషి చేస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సారా దొన్ను ఉప సర్పంచ్ గెమ్మెల నర్చన్న మాట్లాడుతూ మా వంతుగా ప్రభుత్వం నుంచి నిధులు తీసుకు రావడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు సమర్డి రాముర్తి గ్రామ పెద్దలు నరాజి దొన్ను కొరుబారికి చందర్రావు అప్పలస్వామి నరాజి సురేష్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు

## ప్రజారోగ రక్షణే ధ్యేయం... మంత్రి సంధ్యారాణి





### పెదపథంలో ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి

### మేళ తాళాలు, పూలవర్షంతో ఘనంగా సత్కరించిన ప్రజలు

### గ్రీన్ అంబాసిడర్లను సన్మానించిన మంత్రి సంధ్యారాణి

### గిరిజన మహిళలకు రూ. 15 లక్షల సున్నా వడ్డీ రుణం చెక్కును అందజేత

**సాలూరు రూరల్ పెన్ పవర్ అక్టోబర్ 4**

సాలూరు మండలం పెదపథం పంచాయతీలో రూ. 55 లక్షలతో మంజూరైన ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణానికి స్త్రీ శిశు సంక్షేమం, గిరిజన శాఖ మాత్యులు గుమ్మడి సంధ్యారాణి శంకుస్థాపన చేసి శిలాఫలకంను ఆవిష్కరించారు.

ప్రజారోగ్య రక్షనే ధ్యేయంగా ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని రాష్ట్రంలో 40 ఆరోగ్య ఉపకేంద్రం భవనాలు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంజూరు చేశారని, అందులో మన్యం జిల్లాకు 8 మంజూరయ్యాయని, సాలూరు నియోజకవర్గానికి నాలుగు భవనాలు మంజూరయ్యాయని, స్త్రీ శిశు సంక్షేమం, గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణి తెలిపారు. పెదపదం పంచాయతీ ప్రజలు పంచాయతీకి రోడ్లు, అంగన్వాడీ భవనాలు, ఎత్తిపోతల పథకం మంజూరు చేయాలని తెలుపగా మంత్రి అనుకూలంగా స్పందించి మీరు కోరిన పనులన్నీ చేస్తామని మరియు సాగు, తాగునీరు అందిస్తామని మంత్రి సంధ్యారాణి హామీ ఇచ్చారు. వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని వైద్య సిబ్బందికి తెలిపారు.

అనంతరం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గ్రామంలో గల గర్భిణీ స్త్రీలకు సీమంతాలు చేసి మంత్రి ఆశీర్వదించారు. గ్రీన్ అంబాసిడర్ లను మంత్రి సంధ్యారాణి సన్మానించారు.





## పేదలకు ఉచ్చిత ఇసుక ఇవ్వండి మహాప్రభో

**-సిపిఎం అద్వర్యంలో ర్యాలీ, దర్నా**

**నర్సీపట్నం, పెన్ పవర్ ( అక్టోబర్ 04 ) :**పేదలకు ఉచిత ఇసుకను ఇవ్వాలంటూ సిపిఐ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు ఎన్టిఆర్ స్టేడియం నుండి ఐదురోడ్లు జంక్షన్, కృష్ణాబజార్ మీదుగా ర్యాలీ చేసి శ్రీకన్య కూడలిలో మానవ హారం చేపట్టడం జరిగింది. ఈ సందర్భాగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి కొటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో తీవ్రమైన ఇసుక కొరతతో కార్మికలు పనులు లేక రోడ్డన పడ్డారు, ఉచిత ఇసుక ఇవ్వకపోగా ఇసుకే లేని పరిస్తితి దాపురించింది. భవన నిర్మాణ కార్మికులు ఇంతటి తీవ్రమైన సమస్యలతో బాదపడుతుంటే, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి లడ్డూ చుట్టూ తిరగడం సరికాదు అన్నారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై గతం ప్రభుత్వ తప్పిదాలే ఈ ప్రభుత్వము చేస్తుంది అన్నారు. ఈ సందర్భాగా సిపిఎం జిల్లా కమిటి సబ్యులు అడిగర్ల రాజు మాట్లాడుతూ నర్సీపట్నం మరియు డివిజన్ పరిది మండాలలో తీవ్రమైన ఇసుక కొరతతో భవన నిర్మాణ కార్మికులకు నాలుగు నెలలుగా కూలి పనులు లేవన్నారు. గబ్బాడ ఇసుక రీచ్లో సుమారు 40వేలు మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు పై విచారణ జరిపారు, కాని ఇసుక విడుదల చేయులేదు. నది ప్రవాహల నుండి వచ్చే ఇసుకను అనుమతించలేదు. గోదావరి ఇసుక గతంలో 33 టన్నుల లారీ 28000/రూపాయలకు వచ్చేది, 20 టన్నుల లారీ 30000 రూపాయలు ఖర్చు బారం పెరిగినా, ఇసుక దొరకలేదు. అలాగే భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నుండి కార్మికలకు అందాల్సిన పథకాలు అమలు కావడంలేదన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన మెమో 1214 ను రద్దు చేసి, సంక్షేమ పథకాలను పునర్దించాలని కోరారు. భవన నిర్మాణ కార్మిక సంక్షేమ నిది చట్టం ప్రకారం నిర్మాణదారులు నుండి సంక్షేమ సెస్సు 1% వసూలు చేయాలని కోరారు. గబ్బాడ రీచ్ నుండి ఇసుక తక్షణమే విడిదల చేయాలని, నది ప్రవాహల నుండి ఇసుక తవ్వకాలకు అనుమతించాలని, ఇతర సమస్యలు పరిష్కారం కోరకు తగు చర్యలకు ప్రభుత్వానికి నివేదించాలని సిపిఎం పార్టీ తరుపున డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అద్యక్షలు కె.రామకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ సత్తిబాబు, శ్రీను, అప్పలనాయు, రామకృష్ణ, సిపిఎం నాయకులు ఈరెల్లి చిరంజీవి, డి. శివ,తదితరులు పాల్గొన్నారు.




## గ్రామ సమస్యల పరిష్కారమే జనసేన పార్టీ లక్ష్యం

జనసేన పార్టీ నాయకులు గొర్లె వీర వెంకట్





**గూడెం కొత్తవీధి,పెన్ పవర్, అక్టోబర్ 4:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గ్రామాల్లో సమస్యల పరిష్కారమే జనసేన పార్టీ లక్ష్యం అని అరకు పార్లమెంట్ కార్యనిర్వాహక సభ్యులు గొర్లె వీర వెంకట్ అన్నారు. ఆయన జనసేన పార్టీ నాయకులతో కలిసి శుక్రవారం సాయంకాలం గూడెం కొత్త వీధి పంచాయతీలోని గుమ్మడ్ల గొంది గ్రామాన్ని సందర్శించారు.గ్రామస్తులతో వారు సమావేశమయ్యారు. గ్రామస్తుల యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని, సమస్యలను అరకు పార్లమెంట్ జనసేన పార్టీ ఇంచార్జ్ డాక్టర్ వంపూరు గంగులయ్య దృష్టికి తీసుకువెళ్లి,అధికారులకు తెలియజేసి సత్వరమే పరిష్కారం అయ్యేలా ప్రయత్నం చేస్తామని తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గ్రామాల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని, గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి శ్రమిస్తున్నారని గ్రామ సమస్యల పరిష్కారమై జనసేన పార్టీ లక్ష్యం అని అన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ బూత్ కన్వీనర్ గడుతూరి పరమేశ్వర రావు, జనసేన పార్టీ నాయకులు నాడేలి సత్యారావు, మొట్టడం వెంకటేష్, సుర కత్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.